మడకశిరలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- కుక్కలు, మేకలు స్వైర విహారం
- ట్రాఫిక్ నియంత్రణకు చొరవ తీసుకోని పోలీస్ యంత్రాంగం


ప్రధాన రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం

మడకశిర: మడకశిర పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. పట్టణంలో క్రమేణా జనాభా పెరుగుతోంది. ఇప్పటికే పట్టణ జనాభా 25 వేలకు చేరుకుంది. అంతే కాకుండా మడకశిర మీదుగా కర్ణాటక ప్రాంతాలకు రాకపోకలు పెరిగాయి. పూర్తిగా సరిహద్దు ప్రాంతమైన మడకశిర నుంచి బెంగళూరు, తుమకూరు, శిర, హిరియూరు, చళ్లకెర, పావగడకు తిరిగే వాహనాల సంఖ్య పెరిగిపోయింది. 2012లో 20 వార్డులతో మడకశిర మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారింది. మడకశిర మున్సిపాలిటీ కేంద్రంగా మారినా కూడా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది.

ఇష్టారాజ్యంగా పార్కింగ్

పట్టణంలో రోడ్లపై వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. వైఎస్సార్, రాజీవ్‌గాంధీ, అంబేద్కర్, వాల్మీకి, ఎన్టీఆర్ సర్కిళ్లలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా అరవింద థియేటర్, హిందూపురం, పెనుకొండ, పావగడ, అమరాపురం రోడ్లు ఎల్లప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతాలు. ఇలాంటి ప్రాంతాల్లో వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఆటోలు, క్యాబ్‌లను కూడా గంటల తరబడి రోడ్లపైనే నిలబెడుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతోంది. పట్టణంలో కుక్కలు, మేకలు తదితర మూగ జీవాలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధాన రోడ్లలో ఇవి గుంపులుగా రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. వాహనాలకు అడ్డం వచ్చి ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. ఇప్పటికే చాలా మంది ద్విచక్ర వాహనదారులు గాయాలపాలయ్యారు. కుక్కలు దాడులు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. పశువులు, కుక్కలను తరలించాలని స్థానికులు మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్నా ఎలాంటి ఫలితం లేదు.

కనిపించని ట్రాఫిక్ సిగ్నల్స్

పట్టణంలో ఎక్కడా కూడా ట్రాఫిక్ సిగ్నల్స్ లేవు. పోలీసులు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా రద్దీ ఉండే ప్రాంతాల్లో పోలీసులు ఇప్పటి వరకూ ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సిబ్బంది కొరత ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నామని పోలీసులు చెబుతున్నారు. ఏది ఏమైనా పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలి



ప్రస్తుతం ట్రాఫిక్ సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లపై కుక్కలు, మేకలు గుంపులుగా తిరుగుతూ వాహనాలకు అడ్డంగా వస్తున్నాయి. మున్సిపల్ అధికారులు మేకలు, కుక్కల బెడద నివారించడానికి చర్యలు తీసుకోవాలి. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలి.

– అహమ్మద్ అలీ, విద్యావంతుడు, మడకశిర

క్లుప్తంగా

మందులు వాడితే మూర్ఛ నియంత్రణ


రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రామ్మూర్తి

హిందూపురం: మందులు క్రమం తప్పకుండా వాడుతూ జాగ్రత్తలు పాటిస్తే మూర్ఛవ్యాధిని నియంత్రించవచ్చని జెవీవీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈటీ రాంమూర్తి అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆల్‌హిలాల్ స్కూల్‌లో ఉచిత మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 1524 మంది రోగులను పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడా మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో జెవీవీ సభ్యులు రామకృష్ణ, ఓబేలేసు, గంగిరెడ్డి, అతావుల్లా, లక్ష్మీపతి, మురళీమోహన్, ప్రభాకర్, నాగరాజగుప్త, ఉగ్రప్ప, మంజునాథ్ , విశ్వనాథచారి, సుబ్రమణ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంప్లెక్స్ సమావేశాలు

రొళ్ల: మండల పరిధిలోని అలుపనపల్లి, హొట్టేబెట్ట, రొళ్ల కాంప్లెక్స్‌లో సోమవారం జరిగే సబ్జెక్ట్ కాంప్లెక్స్ సమావేశాలకు ఆయా కాంప్లెక్స్ పరిధిలోని పని చేసే ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తప్పక హాజరు కావాలని ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. అలుపనపల్లి కాంప్లెక్స్‌లో రొళ్ల, అగళి మండలంలోని ఉన్నత పాఠశాలలో పని చేసే సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు, హొట్టేబెట్ట కాంప్లెక్స్‌లో రొళ్ల, అగళి మండలాల్లోని ఉన్నత పాఠశాలలో పని చేసే హిందీ ఉపాధ్యాయులకు, రొళ్ల కాప్లెక్స్‌లో రొళ్ల, అగళి మండలాలోని ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

వరద బాధితులకు చేయూత


సరుకుల కిట్లను అందజేస్తున్న జపానంద స్వామి

పావగడ: ఉత్తర కర్ణాటక బెళగావి జిల్లాకు చెందిన గోకాక్, అథణి, రాయబాగ్ తాలూకాల్లోని వరద బాధితులకు ఆదివారం స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి జపానంద స్వామి రెండవ విడతగా 1,200 నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోకాక్ నగరంలో వాల్మీకి క్రీడా మైదానంలో మాజీ మంత్రి రమేశ్ జారకిహొళి నేతృత్వంలో సరుకుల కిట్లు అందజేశఋారు. జపానంద స్వామి త్యాగ నిరతిని రమేశ్ జారకి హొళి కొనియాడారు. జపానంద స్వామి మాట్లాడుతూ.. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహాయ సహకారాలతో 30 ఏళ్లుగా ఆరు రాష్ట్రాల్లో నిరంతరం సేవలందిస్తున్నానన్నారు. అదే విధంగా కేరళలోని వేలాది మంది వయనాడ్ వరద బాధితులను ఆదుకుంటున్నట్లు పేర్కొన్నారు.

యూటీఎఫ్ క్రికెట్ టోర్నీ విజేత రొళ్ల జట్టు


విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న మంత్రి సవితమ్మ

పెనుకొండ: పెనుకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన యూటీఎఫ్ క్రికెట్ టోర్నీలో రొళ్ల ఉపాధ్యాయ జట్టు విజేతగా నిలిచింది. సత్యసాయి జిల్లా యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా పెనుకొండ పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలు ఆదివారం నిర్వహించారు. క్రీడా పోటీల్లో జిల్లాలోని పదహారు ఉపాధ్యాయ జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో ధర్మవరం మండలం ఉపాధ్యాయ జట్టు, రొళ్ల మండల ఉపాధ్యాయ జట్టు ఫైనల్‌లో తలపడ్డాయి. ధర్మవరం ఉపాధ్యాయ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 103 పరుగులు చేసింది. రొళ్ల మండల ఉపాధ్యాయ జట్టు 15 ఓవర్లలో 114 పరుగులు చేసి, విజయకేతనం ఎగుర వేసింది. విజేత జట్టుకు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ ట్రోఫీని అందజేశారు.

అనారోగ్యంతో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మృతి

రొళ్ల: మండల పరిధిలోని హొట్టేబెట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా పని చేస్తున్న ఎం.జే.ప్రభాకర్ (47) అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొందుతు శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం మృతదేహాన్ని స్వగ్రామమైన రొళ్ల మండలం మల్లినమడుగు పంచాయతీ కేంద్రానికి తీసుకొచ్చారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఎంజే ప్రభాకర్ మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


హిందూపురంలో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు


కొడికొండ చెక్‌పోస్ట్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న మహిళలు, సీపీఎం నాయకులు

హిందూపురం టౌన్: కలకత్తాలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కేవీపీఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని కొట్నూరు క్రాస్ వద్ద సీపీఎం కాలనీలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ నిందితులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, కేవీపీఎస్ మండల నాయకులు రామాంజనేయులు, నాజియా, శశికళ, హర్షియా, శాంతమ్మ, కీర్తి, ఆంజనేయులు, అనిత తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: కలకత్తాలో ట్రైనీ వైద్యురాలు హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆదివారం సాయంత్రం 44వ నెంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో మహిళలతో కలిసి సీపీఎం నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలకు భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యురాలిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేత ప్రవీణ్, ఆర్‌ఎంపీ విశ్వనాథ్‌రెడ్డి, ప్రజాసంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

జీఓ 117 రద్దు చేయాలి


ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చుటకు సర్దుబాటు కాకుండా అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ఖాళీలను భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. జీఓలు 117, 128 రద్దు చేయాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, జిలా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చంద్ర, గౌరవ అధ్యక్షుడు మాధవ, రాష్ట్ర కౌన్సిలర్ ముత్యాలప్ప, ఉపాధ్యాయ సంపాదకులు నరేష్ కుమార్, ఉపాధ్యాయులు త్రిమూర్తి, శ్రీనివాసులు, మల్లికార్జున, రవికుమార్, ఉమాపతి, నాగభూషణ, చంద్ర, గోపాల్ నాయక్, బాల కదిరప్ప, నాగరాజు, హరిప్రసాద్, కుళ్లాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలకు జలకళ


రొద్దం:హౌసింగ్ కాలనీ వద్ద ఓ పొలంలో నిలిచిన వర్షపు నీటిలో చేపలు పడుతున్న దృశ్యం


మధూడి సమీపంలో ప్రవహిస్తున్న సువర్ణముఖి నది

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి 5 మండలాల పరిధిలో రెండో రోజు కూడా వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. మడకశిర మండలంలో 23.2 మి.మీ, అమరాపురం మండలంలో 45.6 మి.మీ, గుడిబండ మండలంలో 33.2 మి.మీ, రొళ్ల మండలంలో 32.4 మి.మీ, అగళి మండలంలో 24.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వేరుశనగ తదితర ఖరీఫ్ పంటలకు ఊరట లభించింది. వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరగడానికి ఈ వర్షాలు దోహదం చేస్తాయని రైతులు చెబుతున్నారు.

అగళి: మండలంలో శనివారం రాత్రి సుమరు 12:30 నుంచి 3 గంటల వరకూ వర్షం కురిసింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు చెరువు, కుంటలు, కందకాల్లోకి నీరు చేరింది. వర్షం రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రొద్దం మండలంలో భారీ వర్షం

రొద్దం: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి వాగులు, వంకలు, చెక్ డ్యాంలు పొంగి పొర్లాయి. మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనీవద్ద వర్షపు నీరు భారీగా చేరింది. వర్షపు నీటిలో చేపలు పడ్డాయి. దాదాపు మూడు కిలోల బరువున్నచేపలు దొరికాయి.


రొద్దం: హౌసింగ్ కాలనీ వద్ద వర్షపు నీటిలో దొరికిన పెద్దచేపను చూపుతున్న యువకుడు

కూలిన ప్రాచీన కోట ప్రహరీ


20 అడుగుల కోట ప్రహరీ కూలిపోయిన దృశ్యం

పావగడ: పట్టణంలోని హెడ్ పోస్టాఫీసు ఎదురుగా రాజుల కాలంలో పాలేగాళ్లు (వాల్మీకులు) నిర్మించిన పురాతన కోట ప్రహరీ శనివారం రాత్రి కూలిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తడిసి సుమారు 20 అడుగుల కోట గోడ నిట్ట అకస్మాత్తుగా కూలింది. ప్రసిద్ధ ఏడు చుట్ల కోట కూలిపోవడంతో స్థానిక చరిత్రకారులు, వాల్మీకి సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. పట్టణానికి చెందిన పలుకుబడి ఉన్న ఓ వర్తకుడు కోట పక్కనే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడానికి జేసీబీతో పునాది నిర్మాణానికి మట్టి తవ్వడంతో కోట గోడ దెబ్బతిందని స్థానిక చరిత్ర పరిశోధకుడు చెలువ రాజన్ ఆరోపించారు. ప్రహరీ కూలిపోవడానికి ఇదే ప్రధాన కారణమైందన్నారు. ఇకనైనా కూలిన ఆ కోట ప్రహరీకి మరమ్మతులు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఇక నుంచి ప్రాచీన కోటల పక్కన ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవలన్నారు. రాజుల కాలం నాటి కోట గోడలను సంరక్షించేందుకు పురావస్తుశాఖ ముందుకు రావాలన్నారు. ఇప్పటికే పావగడలో పలు కోటలు ధ్వంసమైనట్లు ఆరోపించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు


భక్తరపల్లిలో లక్ష్మీనరసింహ స్వామిని అలంకరించిన దృశ్యం


జిల్లేడుగుంటలో ఆంజనేయ స్వామి


పావగడ: అలంకరణలో ఆంజనేయస్వామి

మడకశిరరూరల్: మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణ మాస ఆదివారం సందర్భంగా సందడి నెలకొంది. జిల్లేడుగుంట ఆంజనేయ స్వామి, భక్తరహళ్లి లక్ష్మీనరసింహ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అదే విధంగా కల్లుమర్రి వీరకేతమ్మ, చందకచెర్లు ఆంజనేయ స్వామి, జమ్మానిపల్లి లక్ష్మీనిడిమామిడమ్మ తదితర ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. భక్తులకు ప్రసాదం అందజేసిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైఎన్ హొసకోటలో..

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట గ్రామంలో వెలసిన అన్నపూరి ఆంజనేయస్వామికి ఆదివారం పూజలు నిర్వహించారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామికి భక్తులు ఆకుల పూజ కట్టించి పూజలు చేశారు. పూలు, వెండి కవచం అలంకారంలో ఆంజనేయస్వామి భక్తులకు దర్శనమిచ్చాడు.

హేమావతిలో భక్తుల సందడి

అమరాపురం: హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ఉదయం అర్చకుడు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. భక్తులు తెచ్చిన వివిధ పూలతో అలంకరించి మహామంగళ హారతి ఇచ్చారు. మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు ప్రసాదం అందజేశారు.


అమరాపురం: ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

శుభకార్యం

పెనుకొండ రూరల్: రాంపురం పంచాయతీ మాజీ వైస్ సర్పంచ్ వెంకటేశులు కుమార్తె వివాహం, పెద్ద చెరువు కట్ట ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఆదివారం జరిగింది. వివాహ వేడుకకు మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైశాలి జయశంకర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

హిందూపురం టౌన్: కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి నిరాశ్రయులైన బాధితులను ఆదుకునేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్, సద్భావన్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ వరకూ చిరు వ్యాపారులు, హోటల్ యజమానులు, వివిధ వ్యాపారుల నుంచి విరాళాలు సేకరించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ మానవత్వంతో ప్రతి ఒక్కరూ సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాము, రామకృష్ణ, రియాజ్, రెహమాన్, శ్రీధర్, శీన, మోహన్, ఆటో యూనియన్ నాయకులు రామకృష్ణ, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

పరిగి:పరిగి మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న జరగాల్సిన మండల మీట్ కోరం సభ్యులు లేక వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈక్రమంలో వచ్చే శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సవిత అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో పాటు మండల స్థాయి అధికారులు తప్పక పాల్గొనాలని కోరారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు సమస్యలపై అర్జీలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు విధిగా హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించాలని ఆదేశించారు.

నూతన విగ్రహాలకు పూజలు


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి తదితరులు

మడకశిరరూరల్: సిద్దగిరి గ్రామంలో ఇటీవల మరమ్మతులు చేసిన ఆలయంలో మహాగణపతి, శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి నూతన శిలా విగ్రహ స్థిర ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పురోహితులు వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏడీసీసీ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు ఆనంద రంగారెడ్డి నాయకులతో కలిసి నూతన దేవతా విగ్రహాలను దర్శించుకున్నారు. అర్చకులు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు. సోమవారం మహాగణపతి, లక్ష్మీ వేంకటేశ్వర, గోపురకలశ, ప్రాణ ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పురోహితులు తెలిపారు.

రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న అభిమానులు

గుడిబండ: మెగస్టార్ చిరంజీవి 69వ జన్మదినం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిరంజీవి అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో దాదాపు 51 మంది రక్తదానం చేసినట్లు వైద్యులు తెలిపారు.

మూఢ నమ్మకాలను అరికట్టడమే లక్ష్యం


మాట్లాడుతున్న జేవీవీ జిల్లా అధ్యక్షుడు మహేంద్రరెడ్డి

గోరంట్ల: మూఢ నమ్మకాలను అరికట్టడమే లక్ష్యమని జనవిజ్ఞాన పెనుకొండ డివిజన్ అధ్యక్షుడు రమేష్ తెలిపారు. ఆదివారం స్థానిక గిరిజన పాఠశాల ఆవరణలో రమేష్ ఆధ్వర్యంలో పెనుకొండ జోనల్ స్థాయి జనవిజ్ఞాన సదస్సు జరిగింది. సమావేశంలో మొదటగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మహేంద్రరెడ్డి సైన్స్ ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హరి, రామన్న, రాజశేఖర్, ఇలియాజ్, బాబా, మురళి, సాకత్, జోన్ కమిటీ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.